# స్వర్గవాసుల సభలు, సింహాసనాలు

## అంశం : 228

**స్వర్గవాసులు అపూర్వమైన, తెల్లని, పట్టు తివాచీల మీద దిండ్లు పరుచుకొని తమ తమ భవంతుల్లో, ఉద్యానవనాల్లో విరాజిల్లుతూ ఉంటారు.**

"స్వర్గవాసులు దళసరి పట్టు వస్త్రపు అంచు గల తివాచీలపై దిండ్లకు ఆనుకుని ఆసీనులై ఉంటారు. ఆ తోటలలోని చెట్ల కొమ్మలు పండ్లతో వంగిపోయి ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు?"

(ఖుర్ఆన్, రహ్మాన్ : 54-55)

## అంశం : 229

**స్వర్గవాసులు వరుసలుగా, ఎదురెదురుగా ఉంచబడిన అందమైన ఆసనాల మీద ఆసీనులయి ఉంటారు.**

"వారు (స్వర్గవాసులు) వేయబడిన ఆసనాలపై దిండ్లకు ఆనుకుని ఎదురెదురుగా కూర్చొని ఉంటారు. మేము వారికి అందమైన కళ్ళు గల సుందరాంగులనిచ్చి వివాహం చేస్తాము."

(ఖుర్ఆన్, తూర్ :20)

## అంశం : 230

**స్వర్గవాసులు ఎదురెదురుగా ఉంచబడిన సింహాసనాల మీద కూర్చొని రుచి కరమైన ఆహారపానీయాలను ఆస్వాదిస్తారు.**

"వారి కొరకు (స్వర్గవాసుల కొరకు) అందరూ ఎరిగిన ఆహారమే ఉన్నది, రుచికరమైన అన్ని రకాల పదార్థాలు ఉన్నాయి, భోగభాగ్యాలతో విలసిల్లే ఉద్యానవనాలు ఉన్నాయి. వాటిలో వారు సగౌరవంగా ఉంచబడతారు. సోఫాలపై ఎదురెదురుగా కూర్చుంటారు. మధువు చెలమల నుండి పాత్రలు మాటిమాటికీ నింపబడి వారి మధ్య తిప్పబడతాయి. మెరిసిపోతున్న మధువు, తాగేవారికి అది ఎంతో మధురం. దానివల్ల వారి శరీరానికి నష్టం ఉండదు, వారి బుద్ధీ చెడిపోదు."

(ఖుర్ఆన్, సాఫ్ఫాత్ : 41-47)

## అంశం : 231

**సింహాసనాలతో అలంకరించబడిన, వెండి, వజ్రాలు పొదగబడిన ఆసనాలపై స్వర్గవాసులు ఎదురెదురుగా కూర్చొని మధుపాత్రలతో ఆనందిస్తారు.**

“ముందువారైతే ముందున్నవారే. వారే సాన్నిధ్యులు, సకల భోగభాగ్యాలతో నిండి ఉన్న స్వర్గవనాలలో ఉంటారు. వారిలో ముందువారి నుండి చాలామంది ఉంటారు, వెనుక వారి నుండి తక్కువ మంది ఉంటారు. బంగారు జలతారుతో అల్లిన ఆసనాలపై దిండ్లకు ఆనుకొని ఎదురెదురుగా కూర్చుండి ఉంటారు. వారి సమావేశాలలో నిత్య బాల్యం కల బాలురు, మధువు ప్రవహించే చెలమ నుండి నింపిన మధుపాత్రలు, గిన్నెలు, గాజుపాత్రలు, కూజాలు తీసుకొని పరుగెడుతూ తిరుగుతూ ఉంటారు. దానిని తాగడం వల్ల వారి తల తిరగడం గానీ, వారికి బుద్ధి మాంద్యం కలగడం గానీ జరగదు.”

(ఖుర్‌ఆన్, వాఖిఅహ్: 10-19)

## అంశం : 232

**స్వర్గవాసుల ఆసనాలు ఆకుపచ్చని, అరుదైన, విలువయిన తివాచీలతో అలంకరించబడి ఉంటాయి.**

“స్వర్గవాసులు దళసరి పట్టు వస్త్రపు అంచు గల తివాచీలపై దిండ్లకు ఆనుకుని ఆసీనులై ఉంటారు. ఆ తోటలలోని చెట్ల కొమ్మలు పండ్లతో వంగిపోయి ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు?”

(ఖుర్‌ఆన్, రహ్మాన్: 54-55)

## అంశం : 233

**కొన్ని ఆసనాలు ఎత్తయిన ప్రదేశాలపై ఉంటాయి. వాటి మీద ప్రతిచోటా ముత్యాల సింహాసనాలు, మృదువైన తివాచీలు, అందమైన పరుపులు, విలువైన దిండ్లు అలంకరించబడి ఉంటాయి. స్వర్గవాసులు తాము కోరుకున్న చోట సమావేశాలు ఏర్పాటు చేసుకుంటారు.**

“అక్కడ ఎత్తయిన పీఠాలు ఉంటాయి, పాత్రలు పెట్టబడి ఉంటాయి, పెద్ద పెద్ద దిండ్లు వరుసలు వరుసలుగా అమర్చబడి ఉంటాయి, అందమైన తివాచీలు పరచబడి ఉంటాయి.”

(ఖుర్‌ఆన్, గాషిఅహ్: 13-16)

## అంశం : 234

**స్వర్గవాసులు గుబురు నీడల్లో, పీఠాల మీద తమ భార్యలతో ఆనందిస్తారు.**

“ఈనాడు స్వర్గవాసులు సుఖాలు అనుభవించడంలో నిమగ్నులై ఉంటారు. వారు, వారి సతీమణులూ చల్లని నీడలలో, మెత్తని పీఠాలపై విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు.”

(ఖుర్‌ఆన్, యాసీన్: 55-56)